క్లుప్తంగా

నూతన పెన్షన్లు పంపిణీ



నూతన పెన్షన్లు అందుకున్న వారితో వైస్‌చైర్మన్ బాలన్

నగరి : మున్సిపల్ పరిధిలోని సత్రవాడ-2 సచివాలయ పరిధిలో నూతనంగా పెన్షన్లు మంజూరైన వారికి మున్సిపల్ వైస్‌చైర్మన్ బాలన్ నూతన పెన్షన్లను అందించారు. అర్హత ఉండి పలు కారణాలతో పెన్షన్లు రాని వారు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి రోజాకు విన్నవించుకున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హత ఆధారంగా పింఛన్లు మంజూరు చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

నగరి : పట్టణ పరిధిలోని పెన్షనర్స్ భవనంలో ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నగరి యూనిట్ వారి సహకారంతో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు సంఘ కార్యదర్శి ఓ.బాలసుబ్రమణ్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రమాదేవి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ వారిచే నిర్వహించే ఈ వైద్యశిబిరంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో అర్హులైన వారికి ఉచిత వైద్యం, ఉచితంగా ఆపరేషన్లు చేయడం జరుగుతుందన్నారు. ఆపరేషన్లు అవసరమైన వారికి అత్యాధునిక పద్ధతిలో కోత, కుట్టు లేకుండా లేజర్, ల్యాప్రోస్కోపి పద్ధతిలో ఉచిత ఆపరేషన్లు చేస్తామన్నారు.

విద్యా సామగ్రి వితరణ

విజయపురం (నగరి): మండలంలో కొత్తఇల్లత్తూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు చంద్రయ్య బుధవారం విద్యాసామగ్రిని వితరణ చేశారు. హెచ్ఎం పద్మావతి, విద్యార్థుల తల్లిదండ్రుల చేతుల మీదుగా విద్యార్థులకు నోటుపుస్తకం, పెన్నులు, పెన్సిళ్లు అందించారు. దాతలు అందించే విద్యాకానుకను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని విద్యాకమిటీ చైర్మన్ చెంచులక్ష్మి అన్నారు.

తిమ్మరాజుకండ్రిగలో సమస్యలు పరిష్కారం

పెనుమూరు(కార్వేటినగరం): గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పరిష్కరించడంపై తిమ్మరాజుకండ్రిగ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం నారాయణస్వామి గత నెలలో గ్రామానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు, గత 20 ఏళ్లుగా విద్యుత్ సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని, రాజ ఇండ్లు ఎస్టీకాలనీలో తాగునీటి సమస్య ఉందని చెప్పామన్నారు. స్పందించిన ఆయన నెలలోపే గ్రామంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడమే కాకుండా ఇళ్లపై వెళ్తున్న విద్యుత్ తీగలను తొలగింపజేశారన్నారు. రాజ ఇండ్లు ఎస్టీ కాలనీలో తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించిన ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

అభాగ్యులకు అండగా ప్రభుత్వం



పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ గోవిందయ్య

వెదురుకుప్పం: సీఎం జగనన్న ప్రభుత్వం అభాగ్యులకు అండగా నిలుస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ అన్నారు. మండలంలోని పచ్చికాపల్లం, వెదురుకుప్పం, పాతగుంట, నల్లవెంగనపల్లె, బొమ్మయ్యపల్లె సచివాలయ పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఆయా సర్పంచ్‌ల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : ఆముదాల గ్రామ సచివాలయ ఆవరణలో నూతనంగా మంజూరైన 35 మందికి పింఛన్లను ఎంపీటీసీ లిఖిత, సర్పంచ్ అనురేఖ పంపిణీ చేశారు.

స్కూల్ గేమ్స్ ప్రారంభం



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

పుత్తూరు రూరల్: క్రీడల్లో మంచి నైపుణ్యం ప్రదర్శించడం ద్వారా రాష్ట్ర, దేశ స్థాయిలో గుర్తింపు పొందవచ్చని ఈఎంఓ తిరుమలరాజు అన్నారు. బుధవారం స్థానిక ఎస్ఆర్ఎస్ హైస్కూల్ గ్రౌండ్‌లో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో బాగా రాణించి, నియోజకవర్గస్థాయి పోటీలకు అర్హత సాధించాలని క్రీడాకారులకు సూచించారు. అనంతరం తొలిరోజు అండర్-17 బాలురకు నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో పరమేశ్వరమంగళం, కేబీఆర్‌పురం పాఠశాలలు సంయుక్త విజేతలుగా నిలిచినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.సురేష్‌బాబు తెలిపారు. అండర్-14 బాలికలకు నిర్వహించిన టెన్నీకాయిట్ పోటీల్లో గొల్లపల్లి, గేట్‌పుత్తూరు టీమ్‌లు విజేతలుగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 బాలసుబ్రమణ్యం, ఎస్‌జీఎఫ్ కోఆర్డినేటర్ నందకుమార్, ఆర్గనైజర్ గోపీకృష్ణ, పీడీలో మోహన్‌బాబు, శివకుమార్, షేమ్‌సుద్దీన్, అరుణ, లక్ష్మీ, బాబు పాల్గొన్నారు.

దివ్యస్వరూపిణి.. గంగమ్మ..



నగరి : ప్రత్యేక అలంకరణలో గంగమ్మ దేవత

- ప్రత్యేక ఆకర్షణగా పుష్పాలంకరణ
- నగరిలో టీటీడీ సారెను జాతర నిర్వాహకులకు అందజేసిన మంత్రి రోజా
- వైభవంగా గంగమ్మ జాతర





నగరి : సారె తీసుకువస్తున్న మంత్రి ఆర్‌కే రోజా, పుత్తూరు : గంగమ్మకు సారె సమర్పిస్తున్న మంత్రి రోజా

నగరి: నియోజకవర్గంలోని నగరి, పుత్తూరు పట్టణాలతో పాటు పరిసరాల్లో ఉన్న సుమారు 72 గ్రామాల్లో గంగమ్మ జాతర బుధవారం వైభవంగా జరిగింది. నగరిలో డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్లు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ మంగళవారం రాత్రి గంగమ్మ ఊరిమధ్యలో వేసిన వేపాకు గుడిసెకు వచ్చి చేరింది. మంత్రి ఆర్‌కే రోజా సహకారంతో నగరి పట్టణంలో గంగమ్మకు ఈ ఏడాది టీటీడీ వారు శ్వేతవస్త్రాలు అందిస్తూ పుష్పాలంకరణ, చలువపందిళ్ల ఏర్పాటు, పెండియాల్స్ ఏర్పాటు బాధ్యతలు స్వీకరించారు. దీంతో అమ్మవారి వేపాకు గుడిసె వద్ద టీటీడీ వారు ప్రత్యేకంగా చేపట్టిన పుష్పాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పుష్పాలంకరణ నడుమ గంగమ్మ దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిచ్చింది. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారికి వేపాకు సారెలు, చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వెయ్యికన్నుల దుత్తల్లో దీపాలు సమర్పించారు. తడిదుస్తులతో అంగప్రదక్షిణ చేశారు. గంగమ్మను దర్శించుకోవడానికి భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చారు. డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలు బందోబస్తు నిర్వహించారు. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు గంగమ్మ కుంభ నైవేద్యం సమర్పించారు. సాయంత్రానికి చావడి ప్రాంతం జనసమూహంతో కిక్కిరిసిపోయింది. విచిత్ర వేషధారణలో వచ్చిన భక్తులు జాతరలో సందడి చేశారు. బలిఅన్నం సమర్పించే సమయంలో రద్దీ ఎక్కువైంది. రాత్రి గంగమ్మను డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి పొలిమేర దాటించారు.

టీటీడీ సారెను అందించిన మంత్రి రోజా..

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా టీటీడీ అందించిన సారెను జాతర నిర్వాహకులకు అందజేసి అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర నిర్వాహకులు ఆమెను ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవారికి టీటీడీ తరఫున సారెను అందించాలని నిర్వాహకులు తనను కోరడంతో, అధికారులతో చర్చించి ఈ ఏడాదే టీటీడీ నుంచి సారె అందేలా చేశామన్నారు. కార్యక్రమంలో జాతర నిర్వాహకులు నరసింహారెడ్డి, చిరంజీవిరెడ్డి, దయానిధి, ఇంద్రారెడ్డి, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, దేశమ్మ ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు తదితరులు పాల్గొన్నారు. గంగమ్మను మంత్రి రోజా సోదరుడు కుమారస్వామి రెడ్డి, నటి కీర్తిచావ్లా దర్శించుకున్నారు. గంగజాతరను పురస్కరించుకుని ఏటా స్థానిక ఎలక్ట్రికల్ అసోసియేషన్ వారు అధ్యక్షు డు ఎన్‌సీ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.



గంగమ్మకు కుంభం కూడు సమర్పిస్తున్న భక్తులు



గంగమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

ఆక్రమణల తొలగింపు



కామరాజ్ నగర్‌లో ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పుత్తూరు రూరల్: గేట్‌పుత్తూరు కామరాజ్ నగర్‌లోని గోవిందమ్మ ఆలయ పరిసరాల్లోని ఆక్రమణలను బుధవారం మున్సిపల్ కమిషనర్ కెఎల్ ఎన్‌రెడ్డి, వైస్ చైర్మన్ డి.శంకర్ సమక్షంలో మున్సిపల్ సిబ్బంది తొలగించారు. టౌన్ ప్లానింగ్ అధికారులు చూపిన హద్దుల మేరకు, పోలీసుల సహకారంతో ఆక్రమణలు తొలగించినట్లు కమిషనర్ తెలిపారు. మున్సిపాలిటీకి చెందిన స్థలాల్లో, గుంటలు, చెరువుల స్థలాలు, రోడ్డు మార్జిన్ల వద్ద ఆక్రమణలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పట్టణంలో పార్కులు, కమ్యూనిటీ హాళ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న నేపథ్యంలో ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని కోరారు. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు తమవంతు సహకారం అందించాలన్నారు.

జగనన్న కాలనీల్లో తనిఖీలు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం, తిరుమలయ్యపల్లె, పెరుమాళ్లపల్లె, వెదురుకుప్పం సచివాలయాల పరిధిలోని జగనన్న కాలనీల్లో జరుగుతున్న పక్కా గృహాల నిర్మాణపు పనులను తిరుపతి క్వాలిటీ కంట్రోల్ టీం తనిఖీలు చేపట్టింది. ఈసందర్భంగా ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా గృహాలు నిబంధనలకు లోబడి నిర్మాణాలు జరుగుతున్నాయా? నాసిరకంగా చేపడుతున్నారా అనే అంశాలకు సంబంధించి ఆరా తీశారు. హౌసింగ్ డీఈఈ వెంకటేశ్వర్లు, ఏఈ పృథ్వీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సింధూజ ఉన్నారు.

పేదల అభివృద్ధే సీఎం జగనన్న లక్ష్యం

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



మంత్రి నారాయణస్వామిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

కార్వేటినగరం: పేదల అభివృద్ధే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. బుధవారం సర్పంచ్‌లు గుణవతి, నవీన, వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో ముక్కరవానిపల్లి, కత్తెరపల్లి పంచాయతీలలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ 'నేల పైనే నా నడక, పేదలతో నా ప్రయాణం, పెత్తందారులతోనే నా పోరాటం' అనే నినాదంతో ముందుకొస్తున్న సీఎం జగనన్నను 2024 ఎన్నికల్లో ఆదరించాలని పిలుపునిచ్చారు. రాక్షస మనస్తత్వం ఉన్నవారి మాటలు నమ్మితే సంక్షేమ పథకాలు దూరమవుతాయని చెప్పారు. ప్రతి ఇంటికీ రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి అందించామని, నాలుగున్నరేళ్ల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా సమస్యలు పరిష్కరించిన ఘనత కూడా జగనన్నదేనని అన్నారు.

జగనన్నను మరువం..

పలువురు మహిళలు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమాలు, గ్రామాలను అభివృద్ధి చేసిన సీఎం జగనన్నను ఎప్పటికీ మరచిపోమని, ఆయన వెంటే ఉంటామని మంత్రి నారాయణస్వామి ఎదుట తెలిపారు. ముక్కరవానిపల్లి ఏఎడబ్ల్యూ గ్రామంలో సీసీ రోడ్డు, పక్కాగృహాలు మంజూరు చేయాలని మహిళలు మంత్రి దృష్టికి తీసుకురాగా, అర్హులైన వారిని గుర్తించి లబ్ధిదారులు ఎంతమంది ఉన్నా పక్కాగృహాలు మంజూరు చేయాలని హౌసింగ్ అధికారులను మంత్రి ఆదేశించారు. అదేవిధంగా గంగమాంబాపురం, కత్తెరపల్లి గ్రామాల్లో విద్యుత్ లైన్లు ఇళ్లపై ఉన్నాయని, కత్తెరపల్లి బీసీ కాలనీలో 33 కేవీ లైన్లు ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్నాయని తెలుపగా, వెంటనే విద్యుత్ లైన్లను మార్చాలని విద్యుత్ ఏఈ రియాజ్‌ను మంత్రి నారాయణస్వామి ఆదేశించారు. అనంతరం గంగమాంబాపురం, కత్తెరపల్లి ఉన్నత పాఠశాలల విద్యార్థులతో డిప్యూటీ సీఎం నారాయణస్వామి ముచ్చటించారు. కార్యక్రమంలో జిల్లాప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు, మండల కోఆప్షన్‌మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, ఎంపీటీసీలు శ్రీనివాసులురెడ్డి, దేశమ్మ, సర్పంచ్(ఎంఎం విలాసం) పవన్, ఏఎంసీ వైస్ చైర్మన్ గోపి, మునికృష్ణ, పద్మనాభరెడ్డి, ఎంపీడీఓ మోహన్‌మురళి, నాయకులు కృష్ణారెడ్డి, కృష్ణయ్య, తహసీల్దార్ రవికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి వితరణ



క్రీడా దుస్తులను అందిస్తున్న దాత సాయికిరణ్‌రెడ్డి

కార్వేటినగరం: క్రీడాకారులకు క్రీడాసామగ్రితో పాటు వస్తువులను వితరణ చేసిన దాతల ప్రోత్సాహం అభినందనీయమని ఆర్కేఎస్సార్ ఉన్నత పాఠశాల హెచ్ఎం జీ.కోటేశ్వరరావు అన్నారు. గాజులమండ్యం గ్రామానికి చెందిన దాత సిద్దాగుంట సాయికిరణ్‌రెడ్డి విద్యార్థులకు బుధవారం రూ.20 వేలు విలువ జేసే క్రీడా దుస్తులు, వస్తువులను వితరణ చేశారు. ఈ సందర్భంగా దాత సాయికిరణ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడల్లో రాణించాలన్నారు. ఆటల వల్ల ఆరోగ్యంతో పాటు ఉల్లాసంగా ఉంటారని తెలిపారు. అనంతరం దాతను హెచ్ఎం, ఉపాధ్యాయులు సన్మానించారు.

శ్మశానానికి దారి కల్పించాలని నిరసన



శ్మశానంలోకి శవాన్ని తీసుకెళ్తున్న బంధువులు

శ్రీరంగరాజపురం : మండలంలో అంబమహారాజపురం ఆది ఆంధ్రవాడ గ్రామానికి శ్మశానానికి దారి కల్పించాలని గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం అంబమహారాజపురం ఆది ఆంధ్రవాడ గ్రామానికి చెందిన ప్రభాకర్ (60) అనారోగ్యంతో మృతిచెందారు. అయితే శ్మశానానికి వెళ్లడానికి దారి లేకపోవడంతో బంధువులు మృతదేహాన్ని ఖననం చేయడానికి ఇబ్బంది పడ్డారు. వారు మాట్లాడుతూ శ్మశానానికి దారి కల్పించాలని అధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా స్పందించడం లేదని వాపోయారు. అధికారులు స్పందించి ఇకనైనా శ్మశానానికి దారి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

సారా విక్రేత అరెస్ట్



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్ఈబీ సిబ్బంది

నగరి : మండలంలోని మాంగాడు దళితవాడలో సారా విక్రయిస్తున్న సెంథిల్‌కుమార్ (36) అనే వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ వర్ధనాదేవి అరెస్ట్ చేశారు. వివరాలు.. బుధవారం మండలంలో తనిఖీలు నిర్వహించగా ద్విచక్రవాహనంపై సారా తరలిస్తున్న సెంథిల్‌కుమార్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 10 లీటర్ల సారా, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వర్ధనాదేవి తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. తనిఖీల్లో ఎస్ఐ భానుప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో మంచి పోషకాలు



మహిళలకు సూచనలు ఇస్తున్న సీడీపీఓ పద్మజ



పోషకాహార పదార్థాల ప్రదర్శన

పుత్తూరు రూరల్: చిరుధాన్యాలైన కొర్రలు, రాగులు, సజ్జలు, జొన్నల్లో మంచి పోషకాలు ఉన్నాయని, వీటిని ఆహారంగా తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సీడీపీఓ కె.పద్మజ సూచించారు. బుధవారం వడమాలపేట ఎంపీపీఎస్ పాఠశాల ఆవరణలో పోషణ్ పక్వాడ మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులకు, తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవడం ద్వారా రక్తహీనతను అధిగమించవచ్చని చెప్పారు. అలాగే రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చని వివరించారు. ఆహారం ఎలాంటి వంట పాత్రల్లో వండుకోవాలి ? రోజువారి ఆహారంలో ఏవి తీసుకోవాలన్న విషయాలను తెలియజేశారు. కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ పోషకాలు అందే విధంగా ఐదు రంగుల్లోని కూరగాయలను తీసుకోవాలని సూచించారు. చిరుధాన్యాలతో వంట తయారు విధానాన్ని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ కిట్‌లోని ఆహార పదార్థాలను క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రోజారమణి, హేమలత, విజయలక్ష్మి, నీరజ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వినియోగదారులే దేశానికి వెన్నెముక



పోటీ పరీక్షలకు హాజరైన విద్యార్థులు

శ్రీరంగరాజపురం: దేశంలో ఉత్పత్తి చేసే వస్తువులను కొనుగోలు చేసే వినియోగదారులే దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ రాష్ట్ర పరిశీలకులు యుగంధర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన 49కొత్తపల్లిమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. గతంలో వస్తు మార్పిడి దేశంలో ఉండేదని, నేడు ప్రతి వస్తువు నగదు ఇచ్చి కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. వస్తువులను కొనుగోలు చేసే ముందు వాటి నాణ్యత ప్రమాణాలను ఐఎస్ఐ మార్క్‌ను చూసి కొనుగోలు చేయాలని, అలాగే కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు బిల్ రసీదు తీసుకోవాలన్నారు. అనంతరం భారత ప్రభుత్వం వినియోగదారుల సంబంధాలు ఆహార, ప్రజాపంపిణీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వస్తువుల అవగాహనపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన వారికి నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్ అందించారు. హెచ్ఎం శాంతి, ధనుంజయులు, రెడ్డెప్ప, చండీప్రసాద్, డాక్టర్ బండి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి

పాలసముద్రం : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్ కుమార్ తెలిపారు. వెంగళరాజుకుప్పం అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు ఇస్తున్న నిత్యావసర సరుకులు సక్రమంగా అందించాలన్నారు.

తల్లిపాలు శిశువుకు అమృతంతో సమానం

తల్లిపాలే శిశువుకు అమృతంతో సమానమని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. బుధవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో గర్భిణులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జన్మించిన శిశువుకు 6 నెలల వరకు కేవలం చనుబాలు మాత్రమే ఇవ్వాలన్నారు. ఆరు నెలలకు పైగా తృణధాన్యాలు, కిచిడీ, పొంగలి, పప్పులు, పండ్లు ఇవ్వాలన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడాపోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విజయపురం (నగరి): క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక ధృడత్వం కలిగి ఉంటారని ఎంఈఓ ఆంజనేయులు తెలిపారు. బుధవారం మండల కేంద్రం విజయపురం ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలు చదువులతో పాటు ఆటల పోటీల్లో చురుగ్గా పాల్గొని శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండాలన్నారు. అలాగే మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచి దేశానికి మంచి పేరు, ప్రతిష్టలు తేవాలన్నారు. అనంతరం మొదటిరోజు వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్ ప్రారంభించారు. మరో రెండు రోజులు పన్నూరు ఉన్నత పాఠశాలలో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్యామల, మండల క్రీడా కన్వీనర్ గురప్ప, గోపి, సుజాత, లక్ష్మీపతి, ధరణి, రవి పాల్గొన్నారు.

ప్రతి గ్రామం.. అభివృద్ధి పథం



వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ వద్ద మంత్రి ఆర్‌కే రోజా



ప్రారంభించిన నూతన భవనాలు

- దామరపాకంలో రూ.90 లక్షల మేర అభివృద్ధి పనుల ప్రారంభం
- అభివృద్ధికి తార్కాణాలు సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు
- మంత్రి ఆర్‌కే రోజా

నగరి : నియోజకవర్గంలోని ప్రతి గ్రామం కూడా అభివృద్ధి పథంలో నడుస్తోందని ప్రస్తుత ప్రభుత్వంలో నూతనంగా నిర్మిస్తున్న సచివాలయ, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఆర్బీకే భవనాలే ఇందుకు తార్కాణమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. బుధవారం మండలంలోని దామరపాకం గ్రామంలో ఒకే ప్రాంగణంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.21.8 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.20.8 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌తో కలిపి మొత్తం రూ.82 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆమె ప్రారంభించారు. తమ గ్రామంలో ఇన్ని అభివృద్ధి పనులు చేపట్టిన మంత్రి రోజాకు స్థానికులు గజమాలలు, దుశ్శాలువలు వేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వం అభివృద్ధి అనే పదాన్ని మాటల్లో మాత్రమే చెబుతూ వచ్చేదన్నారు. గ్రామస్థాయిలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టిన దాఖలాలు లేవన్నారు. ప్రజాధనాన్ని ఎలా కొల్లగొట్టాలనే దృక్పథంతోనే పార్టీ అధినాయకుడి నుంచి క్షేత్రస్థాయి నాయకుల వరకు అవలంభించారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటుతో ప్రజల చెంతకే ప్రభుత్వ పాలనను సీఎం జగనన్న తీసుకెళ్లారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, డిల్లీ, ఎంపీటీసీ జ్యోతి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీఓ లీలామాధవి, పీఆర్ డీఈ సుబ్బరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సతీష్‌కుమార్, సీడీపీఓ కృష్ణవేణి, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ హరి, పార్టీ నాయకులు హరిరెడ్డి, అరుణాచలం, సత్య, రవి, రమేష్, సోమనాథం, ఏలుమలై తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల సాగు శ్రేయస్కరం



అవగాహన కల్పిస్తున్న గంగాధరం

వెదురుకుప్పం: జీవ వైవిధ్యంతో కూరగాయల సాగు శ్రేయస్కరమని డాక్టర్ గంగాధరం అన్నారు. బుధవారం మండలంలోని పచ్చికాపల్లంలో మహిళా గ్రూపు సభ్యులకు జీవవైవిధ్యం ద్వారా కూరగాయల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగు మందులు వాడుతూ కూరగాయలు పండించడం ద్వారా అనేక రకాల అనారోగ్య సమస్యలతో పాటు భూసారం తగ్గి ఇబ్బందులు వచ్చే ఆస్కారం ఉందన్నారు. 20 సెంట్ల భూమి నుంచి 50 సెంట్ల వరకు సుమారు 15 నుంచి 20 రకాల కూరగాయలు, ఆకుకూరలు పండించి కుటుంబాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చన్నారు. పురుగుల నివారణకు వేప ద్రావణాలు, జీవామృతం తయారీ వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రతినిధులు కృష్ణయ్య, ప్రతాప్‌రెడ్డి, రైతులు, మహిళలు పాల్గొన్నారు.